# సేవలు నిల్.. సర్వేలు ఫుల్

- నిర్వీర్యమైన సచివాలయ వ్యవస్థ
- కార్యాలయాల్లో కనిపించని సిబ్బంది
- సర్వే పనుల్లో సచివాలయ సిబ్బంది
- మూలనపడ్డ కంప్యూటర్లు, ప్రింటర్లు
- మీ సేవలకు జనం పరుగులు



సిబ్బందిలేని పెద్దపంజాణి మండలంలోని మాడి సచివాలయం, (ఇన్‌సెట్) గంగవరం మండల కేంద్రంలోని సచివాలయంలో పనిచేయని ప్రింటర్

పలమనేరు: గత ప్రభుత్వంలో ప్రజలకు ఎన్నో సేవలందించిన సచివాలయ వ్యవస్థ పతనావస్థకు చేరిందా? కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరిపై సర్కార్ కత్తికట్టిందనే మాట వినిపిస్తోంది. గత ప్రభుత్వంలో పలు రకాల సేవలతో కిటికిటలాడిన సచివాలయాలు నేడు ఖాళీగా కనిపిస్తున్నాయి. కనీసం నెట్ బిల్లులకు దిక్కులేదు, పనిచేయక మూలనబడ్డ కంప్యూటర్లు, రిపేరైన ప్రింటర్లు దర్శనమిస్తున్నాయి. గతంలోని సేవలు ఇప్పుడు అందుబాటులో లేవు. దీంతో సేవల కోసం ప్రజలు మీసేవా సెంటర్లకు వెళ్లి వారు అడిగినంత అదనపు చార్జీలను చెల్లించి సర్టిఫికెట్లను పొందాల్సిన పరిస్థితి నెలకొంది. సచివాలయాల్లోని సిబ్బందికి ఈ ప్రభుత్వం రకరకాల సర్వేలను అంటగట్టింది. దీంతో కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు వేసుకోవడం ఫీల్డ్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

**నియోజకవర్గంలో సచివాలయాల వివరాలు..**

- 5మండలాలు, మున్సిపాలిటీలో కలిపి 108 సచివాలయాలు.
- ఒక్కో సచివాలయంలో సిబ్బంది10 మంది
- మొత్తం సచివాలయాల్లో సిబ్బంది 1,100 మంది

**గతంలో వీరి విధులిలా...**

**పంచాయతీ కార్యదర్శి సెక్రటరీ గ్రేడ్–5:** సాధారణ పరిపాలన, గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ చూసేవారు. డిజిటల్ అసిస్టెంట్ 540 రకాల సేవలకు సంబంధించి కంప్యూటర్‌లో నిక్షిప్తం, ఆపై డాక్యుమెంటేషన్, అవసరమైన సర్టిఫికెట్ల జారీ ఉండేది.

**వెల్ఫేర్ అసిస్టెంట్:** ప్రభుత్వ పథకాల అమలు, బడుల్లో మిడ్డేమీల్స్ పర్యవేక్షణ, గ్రామంలో శానిటేషన్. సిరికల్చర్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు.. వీరు ఆయా శాఖలకు సంబంధించి సంబంధిత శాఖకు సహాయకులుగా ఉంటూ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సంబంధించిన సేవలైన విత్తనాలు, పురుగుమందుల సరఫరా, పంటలబీమా సేవలందించేవారు. మండల సర్వేయర్‌కు సపోర్ట్‌గా విలేజ్ సర్వేయర్ ఉండాలి. పాడిరైతుల అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ సేవలందించేవాళ్లు.

**వీరి విధులేమంటే...**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 540 సేవల వ్యవస్థను ఆపేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ఎటూలేదు. ప్రస్తుతం హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్, ఎంఎస్‌ఎంఈపై రుణాల సర్వే, ఎన్‌పీసీఐ లింకేజీ, ఆధార్‌తో బ్యాంకు ఖాతాల లింక్, ఇంటింటా ఆరోగ్యసర్వే, స్వర్ణపంచాయతీ డేటా ఎంట్రీ, ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ విద్యార్థులకు రుణాల సర్వే, పాఠశాలల విజిట్, టాయ్‌లెట్ల ఫొటోల అప్‌లోడింగ్, సంచారజాతుల సర్వేలతోపాటు ప్రతి నెలా సామాజిక పింఛన్ల పంపిణీ విధులు చేయాలి.

**నాడు కళకళ... నేడు వెలవెల...**

గ్రామాల్లోనే ప్రజలకవసరమైన 540 రకాల సేవలు గత ప్రభుత్వంలో అందుబాటులో ఉండేవి. దీంతో సచివాలయాలు జనంతో కిటకిటలాడేవి. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌కు సగటున ఓ సచివాలయానికి పది అర్జీలు దాకా వచ్చేవి. కూటమి ప్రభుత్వంలో ఈ సేవలన్నీ లేవు. సిబ్బందిని సర్వేలకు పంపుతున్నందున సచివాలయాలన్నీ ఖాళీగా మారాయి. పేరుకు భవనాలు కనిపిస్తున్నాయి గానీ అక్కడ సేవలు లేకుండాపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం నెట్ చార్జీలు కూడా చెల్లించలేదు. చాలాచోట్ల నెట్ లేక సర్వర్ లేదని సిబ్బంది చెబుతున్నారు. కొన్నిచోట్ల కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయక మూలనపడ్డాయి. కేవలం డిజిటల్ అసిస్టెంట్ తప్ప ఎవరూ కనిపించడంలేదు. దీంతో అర్జీదారులు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలకు వస్తున్నారు. గతంలో మండల కేంద్రంలో జరిగే గ్రీవెన్స్‌డేకు సగటున నాలుగైదు అర్జీలు కూడా వచ్చేవి కాదు. కానీ ఇప్పుడు ఆసంఖ్య 30కి పెరిగింది.



వి.కోట సచివాలయంలో సేవలందక వేచి చూస్తున్న సిబ్బంది



బైరెడ్డిపల్లి సచివాలయంలో సర్వర్ లేక ఖాళీగా కూర్చున్న డిజిటల్ అసిస్టెంట్



వి.కోట సచివాలయం వద్ద జనానికి తప్పని పడిగాపులు

**పట్టించుకోవడం లేదు...**



సచివాలయాల సేవలు గతంలో ఉన్నట్టు ఇప్పుడు లేవు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమకు రకరకాల సర్వేల పేరిట ఒత్తిళ్లకు గురిచేస్తున్నారు. దీంతో సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ మాత్రం ఉంటారు. అయితే గతంలోని సేవలు ఇప్పుడు లేవు. అరకొరా సేవలకు సిస్టమ్ రిపేర్లు, ఆన్‌లైన్ సేవలు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

–రాష్ట్ర సచివాలయాల సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు మురళీనాథ్

**సచివాలయాల వ్యవస్థ నాశనమైంది..**



గత ప్రభుత్వంలో జనానికి ఏపని కావాలన్నా ఉన్న గ్రామంలోనే సచివాలయంలో ఉచితంగా గంటలో జరిగేది. ఇప్పుడు సచివాలయ వ్యవస్థ నాశనమైంది. అక్కడ ఎలాంటి సేవలు లేవు. దీంతో సీఎస్సీ, మీసేవా సెంటర్లకు వెళ్లి కావాల్సిన సేవలను డబ్బులు కట్టి చేయించుకోవాలి. అవి కూడా మండల కేంద్రాలకు వెళ్లినా అంత సులభంగా జరగవు. ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేయాలిగాని ఇలా ఇబ్బందులు పెట్టడం కరెక్ట్‌కాదు.

–కోదండరామయ్య, కౌన్సిలర్, పలమనేరు

## క్లుప్తంగా

### ఇంటి స్థలాలు ఇవ్వాలి

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని బీకేఎంయూ వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు రామ్మూర్తి డిమాండ్ చేశారు. శనివారం ఆయన పట్టణంలోని రాంనగర్ కాలనీలో పేదల వివరాలను సేకరించారు. మున్సిపాలిటీ పరిధిలో వేలాది మంది పేదలు ఉన్నారని, వారికి ఇంటి స్థలాలు, రేషన్‌కార్డులు, పెన్షన్లు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వివరాలు సేకరించి జిల్లా కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

### 21 నుంచి అగస్తీశ్వరస్వామి ఉత్సవాలు



నెక్కుందిలో వెలసిన అగస్తీశ్వరస్వామి

పుంగనూరు: మండలంలోని నెక్కుంది కొండపై వెలసిన అగస్తీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఈనెల 21 నుంచి మార్చి 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గణపతి పూజ, అంకురార్పణతో ప్రారంభమై, 26 శివరాత్రి రోజున అభిషేక కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. 28న కల్యాణోత్సవం, రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శివరాత్రి ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### మద్యం దుకాణానికి 16 టెండర్లు

కుప్పం: నియోజకవర్గానికి కల్లుగీత కార్మికుల కోటా కింద మంజూరైన ఒక్క మద్యం దుకాణానికి 16 టెండర్లు దాఖలయ్యాయి. గుడుపల్లె జనాభా, కల్లుగీత కార్మికులకు ఒక్క షాపు కేటాయించారు. ఈ మద్యం దుకాణానికి శనివారం దరఖాస్తులు గడువు ఆఖరు కావడంతో 16 టెండర్లు దాఖలయ్యాయి. వీటిని కులుకు పద్ధతిలో టెండర్లు తెరవనున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు తెలిపారు. కులుకులో మద్యం దుకాణం దక్కించుకున్న అభ్యర్థిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం షాపును కేటాయిస్తామని తెలిపారు.

### రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డులు

శాంతిపురం: రైతులకు డిజిటల్ విశిష్ట గుర్తింపు కార్డులను జారీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. రైతు సమాచార కేంద్రాల(ఆర్‌ఎస్‌కే) ద్వారా జారీ చేసే ఈ కార్డుల ఆధారంగా భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. దీని కోసం ఆధార్ కార్డు, లింక్ అయిన ఫోన్ నంబర్, పట్టాదారు పాసుపుస్తకంతో రైతులు ఈనెల 25లోపు ఆర్‌ఎస్‌కేని సంప్రదించాలని కోరారు. విశిష్ట కార్డుల ఆధారంగా పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీ అందుకునే వీలు ఉంటుందన్నారు. నేరుగా ఆర్‌ఎస్‌కేకి రాలేని వారు సంబంధిత అధికారికి ఫోన్ చేసి వివరాలు, ఓటీపీ చెప్పడం ద్వారా నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

### ఇంటి స్థలాల పంపిణీకి డిమాండ్



అర్జీలు రాయిస్తున్న సీపీఐ నేతలు

చిత్తూరు కార్పొరేషన్: కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు నగరంలోని లెనిన్‌నగర్, హౌసింగ్‌కాలనీ, మంగసముద్రం హౌసింగ్ కాలనీలో పర్యటించి అర్హులతో అర్జీలు రాయించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ వినతి పత్రాలను సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌కు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు గోపీనాథ్, మణి, రమాదేవి, విజయ్‌కుమార్, విజయగౌరీ, కుమారి, కవిత, లతారెడ్డి, రఘు, చాంద్‌బాషా, కార్తీక్ పాల్గొన్నారు.



### తప్పిన ప్రమాదం

చెన్నై– బెంగళూరు జాతీయ రహదారిపై నరహరిపేట సమీపంలో శనివారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. చిత్తూరు నుంచి వేలూరుకు ఓ వ్యాను వెళుతుండగా అందులోని ఇనుప పైపులు ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయాయి. ఆ సమయానికి వాహనాలు రాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. పోలీసులు రాకపోకలను క్రమబద్ధీకరించారు. –గుడిపాల

## కార్యకర్తలకు అండగా ఉంటాం



పోలీస్ స్టేషన్‌లో సంతకం చేస్తున్న వెంకటేగౌడ

–పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటిదాకా ఇచ్చిన హామీలను అసలు పట్టించుకోకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన కండిషన్ బెయిల్‌పై సంతకం చేసేందుకు శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నేతలు స్వాగతం పలికారు. అందరూ ధైర్యంగా ఉండాలని ప్రజల్లో ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. ప్రజల పక్షాన పోరాడేందుకు మనమందరం సిద్ధంగా ఉండాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం తమవల్ల కాదని సాక్షాత్తు సీఎం చంద్రబాబే చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆపై గంటావూరులో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న షౌకత్‌అలీ కుటుంబసభ్యులను ఆయన ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం జరావారిపల్లిలో ప్రమాదంలో గాయపడిన మనోజ్‌ను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణమూర్తి, పట్టణ కన్వీనర్ జాఫర్, దయానందగౌడ, చెంగారెడ్డి, మండీసుధా, ప్రహ్లాద, బాగారెడ్డి, శ్యామ్, వీరభద్ర, ఈశ్వర్‌రెడ్డి, రహీంఖాన్, కమల్, షబీర్, నరేష్, ముజ్జు, మొహిద్దీన్, సుబ్బు, గోవిందు, మునస్వామి పాల్గొన్నారు.

### ఇళ్లను కూల్చకుండా బైపాస్‌కు వినతి

రామకుప్పం (శాంతిపురం): కుప్పం–పలమనేరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమ ఇళ్లను కూల్చకుండా బైపాస్ రోడ్డును నిర్మించాలని రామకుప్పం మండలం చెల్దిగానిపల్లి వాసులు కోరారు. ఈ మేరకు వారు శనివారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు వినతి పత్రం అందించినట్టు తెలిపారు. ప్రతిపాదిత రోడ్డు విస్తరణతో తమ గ్రామంలో 110 కుటుంబాలు ఇల్లను, బతుకుతెరువుగా ఉన్న దుకాణాలను కోల్పోవాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వి.కోట బైపాస్ రోడ్డును తమ గ్రామం తర్వాత వరకూ పొడిగించాలని కోరారు.

### పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

బైరెడ్డిపల్లె: నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 10న 19 ఏళ్ల లోపు బాలబాలికలకు మాత్రలు అందించాలని వైద్యాధికారులు రాజేంద్ర, అరుణ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నులిపురుగుల వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోందని, దీంతో మాత్రలు వేసుకోవడంతో ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. మాత్రల వలన ఎలాంటి ఇబ్బందులు ఉండవని, భయాందోళనకు గురికాకుండా మాత్రలు వేసుకోవాలన్నారు. ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సాయిదివ్య, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

## కమనీయం.. లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పులిచెర్ల(కల్లూరు): దేవళంపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయ జీర్ణోద్ధరణ జరిగి 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి కల్యాణోత్సవం, అనంతరం ప్రాకార ఉత్సవం, భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసినట్లు అర్చకులు అనంత కుమార ఆచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

### 12,13తేదీల్లో మసెమ్మ జాతర



కొండచెర్ల కురప్పల్లెలోని మసెమ్మ

పుంగనూరు: పుంగనూరు మండలం ఆరడిగుంట పంచాయతీ కొండచెర్ల కురప్పల్లెలో ఈనెల 12, 13 తేదీల్లో మసెమ్మ జాతర జరగనుంది. ఈ మేరకు శనివారం గ్రామస్తులు అమ్మవారి ఆలయాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు. రెండు రోజుల పాటు నిర్వహించే జాతరలో అమ్మవారికి తొలి పూజలను ఆచారం ప్రకారం వడ్డిబోయుల కులస్తులు చేస్తారు. గ్రామంలోని కుంటి, ధన, బోయకొండ, నడివీధి గంగమ్మలకు పూజలు నిర్వహించి, పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించి 13న గురువారం భక్తుల దర్శనార్థం అమ్మవారిని మసెమ్మ ఆలయం వద్ద నిలుపుతారు. జాతరను కోలాహలంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.

## రోబోటిక్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: జాతీయ స్థాయి ఆరో రోబోటిక్ పోటీల్లో బృందావన్ సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని స్కూల్ చైర్మన్ శైలజా కుమారి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ చెన్నైలోని విట్ విశ్వవిద్యాలయంలో జరిగిన రోబోటిక్ పోటీల్లో తమ పాఠశాల నుంచి 68 మంది విద్యార్థులు పాల్గొన్నారని వెల్లడించారు. అందులో 31 మంది బహుమతులు సాధించినట్లు వివరించారు.

## హనుమంతునిపై వేణుగోపాలుడి చిద్విలాసం



హనుమంతునిపై స్వామివారు

వి.కోట: పట్టణంలో మూడు రోజులుగా కోలాహలంగా సాగుతున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలుడు హనుమంత వాహనంపై పురవీధుల్లో భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి హనుమంత వాహనంపై స్వామి వారిని మంగళవాయిద్యాలు నడుమ ఊరేగించారు. మహిళలు అడుగడుగునా స్వామివారికి హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ధర్మకర్త సీతారామయ్య పాల్గొన్నారు.

## మోక్షితారెడ్డికి అభినందనలు



మోక్షితారెడ్డిని అభినందిస్తున్న సభ్యులు

పలమనేరు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ లాంగ్‌జంప్ విభాగంలో వెండి పతకాన్ని సాధించిన పలమనేరు విద్యార్థిని మోక్షితారెడ్డిని స్థానిక కాఫీ బడ్డీస్ సభ్యులు శనివారం అభినందించి ఆమెకు తర్వాత పోటీల కోసం స్పోర్ట్స్‌షూలను అందించారు. అమ్మాయికి శిక్షణనిచ్చిన స్థానక కోచ్ జలాల్‌ను వారు అభినందించారు. ఇందులో సాయిచైతన్య కళాశాల ప్రిన్సిపల్ కిశోర్, కౌన్సిలర్ కుమార్, లక్ష్మీపతి, రామూర్తి, పూల లోకేష్ పాల్గొన్నారు.

## గుండెపోటు బాధితులకు హృదయరక్ష తోడు



అవగాహన కల్పిస్తున్న డా.మమతారాణి

పలమనేరు: గుండెపోటు వచ్చిన వారికి హృదయరక్ష తోడుంటుందని ఈ అవకాశాన్ని హృదయ సంబంధిత రోగులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. మమతారాణి సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ఆస్పత్రిలో హృదయరక్షపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఈ సేవలు స్థానిక ఆస్పత్రిలో ఉన్నప్పటికీ దీనిపై చాలామందికి అవగాహన లేదని మరో దఫా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరికైనా గుండెనొప్పి రాగానే వెంటనే ఇక్కడున్న ఆస్పత్రికి వస్తే ఈసీజీ చేసి విలువైన ఇంజెక్షన్ ఇస్తామన్నారు. ప్రజల్లో దీనిపై వైద్యులు, మీడియా మరింత ప్రచారం చేయాలని సూచించారు. ఆర్‌ఎంఓ డా.శారద, జనరల్ మెడిషన్ డా.సరోజిని పాల్గొన్నారు.

## ● కార్మికులకు కరెంట్ కష్టాలు





కరెంట్ కష్టాలతో దిక్కుతోచని స్థితిలో కార్పెంటర్లు, (ఇన్‌సెట్) విద్యుత్ లేకపోవడంతో ఖాళీగా కుర్చున్న వడ్రంగి

బైరెడ్డిపల్లె: కూలీ చేస్తేగానీ పొట్టగడవని కుటుంబాలు మండల పరిధిలో చాలా ఉన్నాయి. అలాంటి కుటుంబాల్లో ఎంతో మంది విద్యుత్ ఆధారంగా పనిచేసే వారు ఉన్నారు. ప్రతి శనివారం మరమ్మతుల పేరుతో విద్యుత్‌శాఖ అధికారులు 4, 5 గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. విద్యుత్‌ను ఆదా చేయడానికే ఇలాంటి పరిస్థితి సృష్టిస్తున్నారని కార్మికులు మండిపడుతున్నారు. విద్యుత్ లేని సమయంలో కూలీలు కూడా గిట్టుబాటు కావడం లేదని యజమానులతో పాటు కార్మికులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో చిరువ్యాపారులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.